# ఉభయ మారకం



ప్రొద్దున్నే బద్ధకంగా బాత్‌రూం తలుపు బోల్ట్ తీస్తున్నాడు బుచ్చిబాబు. తీస్తుండగానే, అతని చేతి క్రింది నుంచి గబుక్కున లోపలికి దూరి, దబుక్కున తలుపుమూసి, చటుక్కున లోపలి బోల్ట్ వేసేసింది విమల!

"ఏయ్! ఏయ్! ఏమిటది! నేనర్జంటుగా వెళ్ళాలి" అరిచాడు బుచ్చి.

"నేనంతకన్నా అర్జంటుగా బ్యాంకు కెళ్ళాలి" తిరిగరిచింది విమ్మీ.

"ఛ! ఛ!" అనుకుంటున్న బుచ్చిబాబుకి — బాత్రూం లోంచి, గాజులు, మంగళసూత్రాల గలగలతో కలగలిసిపోయిన — స్నానాల గది చప్పుళ్ళు, అంత అర్జంటులోనూ మన్మథ గర్జనల్లా వినబడ్డాయి.

"అదేదో యిద్దరం కలిసి ఏడిస్తే, ఒకేసారి రెండు పన్లూ అయిపోయేవి కదా!" అన్నాడు.

"నా బుచ్చే! తమరితో లోపలి కొస్తే, అయిపోయేది పన్లు కాదు, నా బ్యాంకు" రుద్దుతున్న సోపుకన్నా ముద్దుగా సోకుపోయింది విమల గొంతు.

"అంతే! అంతే! మొగుడు పోయినా సరే, బ్యాంకు పోకుండా వుంటే చాలు!"

"ఏమిటా వెధవ మాటలు!" పంపుకన్నా ఫోర్సుగా వుంది విమల గొంతు.

"నీ బ్యాంకు దయవల్ల, ఈ వెధవకి, మాటలేగా మిగిలింది చివరికి?" బుచ్చి గొంతు బాత్‌రూం క్లీనర్ లాగా పొగలు కక్కుతోంది.

లోపల నీళ్ల చప్పుడాగిపోయింది. "బాత్రూం బయటే వేళ్ళాడుతూ, అలా వాగుతూ, నా ప్రాణం తీసే బదులు, కాస్త మాడే కూర దింపవచ్చు గదా?" తీక్షణంగా అంది విమల.

"బయటేం కర్మ! లోపలా వేళ్లాట్టమే నా పని!! కూర ఏం కర్మ!! నేనే మాడిపోతాను ఎప్పుడో! అప్పుడు నీ ప్రాణం సుఖంగా వుండచ్చు" కూర గిన్నె ధమ్మని చప్పుడు.

కళ్లనీళ్లు తిరుగుతూ బాధగా బయటికొచ్చింది విమల.

టర్కీ టవల్ భుజాన వేసుకుని విసురుగా లోపలి కెళ్ళాడు బుచ్చిబాబు!

యాంత్రికంగా డ్రెస్సయిపోయి, పిల్లల్ని రెడీ చేసి, క్యారియర్‌లు సర్దేసి, బయటికి కదుల్తూ, "గ్యాసు పొయ్యి గట్టుమీద వంట రెడీగా వుంది. పిల్లల్ని దింపి నే బ్యాంకుకి వెళ్తున్నా. సాయంత్రం తీసుకొస్తారుగా" అని కేకేసింది విమల.

"తీసుకొస్తాన్లే! ... రోజూ వింటున్నదేగా వెధవ రికార్డు! అరిగిపోయిన రికార్డు" ఒళ్లు తుడుచుకుంటూ బయటకొస్తున్న బుచ్చిబాబు విదిలించాడు, "ఇల్లాగే రిటైరయ్యేదాకా, బ్యాంకులో రికార్డులూ, ఇంట్లో రికార్డులూ అరగదియ్యి. నేనెప్పుడో బాల్చీ తన్నేస్తాను. కూడబెట్టిన లక్షల్తో అప్పుడెంజాయ్ చెయ్యొచ్చు ఒక్కత్తివీ హాయిగా హనీమూన్ లయ్యవు!"

ఆ మాటలు వింటూ కదిలిపోయింది విమల!

** ** **

విమల బ్యాంక్ ఉద్యోగి!

బుచ్చిబాబు గౌర్నమెంట్ ఆఫీసరు!

పనిమనిషి, పాలమనిషి, కూరల మనిషి, కాఫీలు, వంట, పిల్లల స్కూలు, వీటిల్తో తెముల్చుకుని ప్రొద్దున్నే బ్యాంకుకి తయారయి వెళ్ళిపోవాలి విమల.

ఎనిమిదింటికే, ఇల్లాలు ఆఫీసుకెళ్ళిపోతే, పదింటి దాకా ఏడుపుమొహం ఈడ్చుకుంటూ ఫ్లాస్కులో కాఫీ తాగి, వడ్డించుకున్న అన్నం తిని, అంట గిన్నెలు అవతలికి నెట్టి, తలుపులు తాళం వేసి బయల్దేరాలి బుచ్చిబాబు.

మధ్యాహ్నం ఇంటికొచ్చి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, నాలుగు నిమిషాలు రెప్ప తీసుకుని, మళ్ళీ ఈవెనింగ్ కౌంటర్‌కి రెడీ అయిపోతుంది విమల!

సాయంత్రం స్కూలుకెళ్ళి – పిల్లల్ని తీసుకొచ్చి, ఏడున్నరకి ఆవిడగారొచ్చేదాకా ఎటు పోవడానికీ లేక, చేతనైనంత వంట చేసి ఎదురుచూస్తూ కూర్చుంటాడు బుచ్చిబాబు.

రాంగానే ఆయనగారి వంట రిపేరు చేస్తూ కొంత సేపు పిల్లలకి హోం వర్కు చేయించి కొంత సేపు ఓవర్ టైము చేస్తుంది విమల. చివరికి పడుకునే సమయానికి అలిసిపోయి నిద్రో! మాడు పట్టునుంచి – అరికాలి దాకా ఎక్కడో అక్కడ నొప్పి! గుడ్ నైట్!!!



మిషన్ అయిపోయిన వైఫ్‌తో, లైఫ్‌లో కుషన్ పోయింది బుచ్చిబాబుకి. రొటీన్ లైఫ్‌తో సెటప్ అయి పోయింది విమల! "సెటప్" చేద్దామనుకున్న ఎన్నో నైట్సు "షటప్" ఎదురై, "అప్‌సెట్" అయి పోయాడు బుచ్చిబాబు.

"అటు ఆఫీసులో, యిటు యింట్లో రెండు వైపులా నలిగిపోతున్నావు. నువు సుఖపడలేని, నన్ను సుఖపెట్టలేని ఈ ఉద్యోగం ఎందుకు? మానెయ్యరాదూ?" అన్నాడు నాల్రోజుల క్రితం నిద్రపట్టని ఓ నైటు.

"అదేదో మీరే చేసి, నన్ను సుఖపెట్టొచ్చుగా" అని అటు తిరిగి పడుకుంది విమ్మీ.

అంతే! ఆ రోజు నుంచీ పెంపుడు పూడిల్ లాగా వుండే బుచ్చిబాబు, ఫ్యూడల్ బ్యారన్‌లాగా తయారవు తున్నాడు. రోజురోజుకీ రఫ్‌గా తయారవుతున్న బుచ్చిని చూసి, ఎప్పుడూ లేని భయం పట్టుకుంది విమలకి.

సుఖం కోరిన బుచ్చి మనసు అడ్డం తిరిగితే?! మన సిచ్చిన మగవాడు తనవాడు కానివాడు, ఎంత ఉద్యోగం వుండి ఏం ప్రయోజనం? తన మనసు గతి, తన పిల్లల గతి ఏమిటి?... ఆలోచించింది విమల!

** ** **

సాయంత్రం స్కూలు కెళ్ళిన బుచ్చిబాబుకి, "అమ్మగారొచ్చి పిల్లల్ని తీసికెళ్ళారండి" అంది ఆయా!

ఇంటికెళ్ళిన బుచ్చిబాబుకి మల్లెమొగ్గల మధ్య ముద్ద మందారమల్లే దర్శనమిచ్చింది విమల!

ఆశ్చర్యపోతున్న బుచ్చికి కాఫీ యిచ్చి "మై డియర్ బుచ్చీ! మీకో గుడ్ న్యూస్! నేను జాబ్ రిజైన్ చేసేశాను" అంది విమల.

"ఆ!" అని కూలబడిపోయాడు బుచ్చిబాబు. ఓ అరగంట షోడశోపచారాల తర్వాత, స్లోగా లేచిన బుచ్చి బాబుతో "ఏమైందండీ! ఏమైంది?" అని అడిగింది విమల.

"నిజంగా జాబ్ రిజైన్ చేశావా?" సందేహంగా అడిగాడు బుచ్చి.

"నిజంగానే చేశాను. మిమ్మల్ని సుఖపెట్టలేని ఆ జాబ్ ఎందుకు నాకు? అంచేతే రిజైన్ చేసేశాను" ఆవేశంగా చెప్పింది విమ్మీ.

"ఖర్మ! ఖర్మ!" అన్నాడు బుచ్చి.

"ఏమిటోయ్ ఖర్మ?" అని మీద పడింది విమల.

"నీ సుఖం కోరి నేనూ జాబ్ రిజైన్ చేశాను."

"ఆ!" అని కూలబడిపోయిన విమలతో యింకా చెప్తూనే వున్నాడు బుచ్చిబాబు, "ఆత్మాభిమానం కల నువ్వు, నాకన్నా ముందొచ్చిన ఆ జాబ్‌ని వదలలేవని నిశ్చయం చేసుకుని, నిన్ను వదలలేని నేను జాబ్‌ని వదిలేశాను ......

కారుమబ్బుల మధ్య ఉదయించిన సూర్యుణ్ణి కాన లేక, వికసించలేని తామర పువ్వూ —

చంద్రోదయం లేక ముకుళించుకుపోయిన కలువ పువ్వూ —

రెండూ, ఒక్కలాగే కనిపించి, తామరాకు మీది నీటి చుక్కలు రెండు ఫక్కుమన్నాయి.

— విశ్వనాథ పావనిశాస్త్రి

31-3-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక